ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.15 నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చి మిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 15, దోసకాయ 18, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రేపు ఓయూలో జార్జిరెడ్డి వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో దివంగత పీడీఎస్‌యూ విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి 53వ వర్ధంతి సందర్భంగా విద్యార్థి నాయకులు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నేడు, రేపు ఓయూలో వర్ధంతి సభ, కాగడాల ప్రదర్శన, మార్నింగ్ వాక్, జార్జిరెడ్డి సినిమా ప్రదర్శించనున్నారు. నేడు (13న) సాయంత్రం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు కాగడాల ప్రదర్శన, రేపు (14న) పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థుల కిన్నెర హాస్టల్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు మార్నింగ్ వాక్, సాయంత్రం 6 గంటలకు ఆర్ట్స్ కాలేజీ ఎదుట జార్జిరెడ్డి సినిమా ప్రదర్శించనున్నట్లు పీడీఎస్‌యూ నాయకులు వివరించారు.

నేడు పద్మారావునగర్ పార్కులో సీసీ కెమెరాల ప్రారంభం

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కులో సీసీ కెమెరాలను ఈనెల 13న ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సీసీ కెమెరాలను ప్రారంభిస్తారని పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యం వాకర్స్, సందర్శకులతో సందడిగా ఉండే పార్కులో భద్రత కోసం నూతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మామిడి బాల్‌రెడ్డి చెప్పారు. పెద్ద ఎత్తున వాకర్స్, సందర్శకులు కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

20 నుంచి పీహెచ్‌డీ ఎంట్రన్స్ హాల్‌టికెట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 20 నుంచి పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ హాల్ టికెట్లను జారీ చేయనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి శనివారం తెలిపారు. రిజిస్ట్రేషన్ నంబర్ లేదా పుట్టిన తేదీ ద్వారా ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో జరిగే సీడీటీ ఎంట్రన్స్ టెస్ట్‌కు నగరంలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వాటర్ బాటిళ్ల వితరణ



వాటర్ బాటిళ్లను అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: అమీర్‌పేట జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు జరుగుతున్న వైశాఖీ ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవాలకు హాజరైన సిక్కుల కోసం బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ 3 వేల వాటర్ బాటిళ్ల వితరణ చేశారు. వేసవికాలం దృష్ట్యా వారు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేలా వాటర్ బాటిళ్లను అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ప్రతియేటా వైశాఖీ ఉత్సవాలకు ఆయన ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది.

ఘనంగా శ్రీశక్తి వార్షిక వేడుకలు



సనత్‌నగర్: బేగంపేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ శ్రీశక్తి 31వ వార్షిక వేడుకలు శనివారం హోటల్ మనోహర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విశిష్ట అతిథిగా పార్క్ హయత్ హోటల్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ వాఖార్కర్ హాజరై మాట్లాడుతూ..ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక, అతిథ్య రంగానికి ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. ఆయా రంగాల్లోని అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల వార్షిక ప్రతికను విడుదల చేశారు. వృత్తి నైపుణ్యాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశక్తి గ్రూప్ చైర్మన్ డీవీ మనోహర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపింజల, డైరెక్టర్ యమునా రంగారావు, ప్రిన్సిపాల్ అనితాచంద్రన్ పాల్గొన్నారు.



బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్



బోయిన్‌పల్లిలో.. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, పాండుయాదవ్



సవరాలబస్తీలో.. ఎమ్మెల్యే పద్మారావు, కార్పొరేటర్ హేమ, భువన్‌రావు



తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్



బజరంగ్‌దళ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

జై వీర హనుమాన్

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు | జై శ్రీరాం నినాదాలతో మార్మోగిన కాలనీలు

హనుమాన్ జయంతి వేడుకలను సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జై బజరంగ్‌బలి నినాదాలతో పలు వీధులు హోరెత్తాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ల బృందం



మారేడుపల్లిలో.. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ



పూజల్లో సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి



తాడ్‌బండ్ ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సీవీ ఆనంద్



వేడుకల్లో వెల్లాల రామ్మోహన్



అన్నదానం చేస్తున్న మర్రి పురురవరెడ్డి



సనత్‌నగర్‌లో పూజలు చేస్తున్న ఈటీ



సనత్‌నగర్‌లో మజ్జిగ పంపిణీ



సనత్‌నగర్‌లో..ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



చిన్నారుల భక్తి పాటలు



బోయిన్‌పల్లిలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి



వేడుకల్లో మైలార్‌గడ్డ హనుమాన్ వ్యాయామశాల సభ్యులు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సాయిబాబా



వారాసీగూడ కూడలిలో.. మేకల సారంగపాణి



తుకారాంగేట్ సుభాష్ బొమ్మ వద్ద..



కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి



తుకారాంగేట్‌లో.. కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలి



జాతినేతల జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రతినిధులు

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ హమలిబస్తీలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో మహనీయుల జయంత్యోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ త్యాగాలు, స్ఫూర్తి గురించి పలువురు వక్తుల మాట్లాడారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ.. దళిత బహుజన సాధికారిత ప్రచారోద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకోవడం కోసం విస్తృత ప్రచార కార్యక్రమాలు జరగాలన్నారు. గృహ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు మంజూరు చేయాలన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: మహనీయుల జీవితాల సారాన్ని భావి తరాలకు అందించాలని ఓయూ వీసీ ప్రొ.కుమార్ అన్నారు. పూలే, అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఓయూ దూర విద్య కేంద్రం ఆడిటోరియంలో సామాజిక న్యాయం దిశగా సమగ్ర ప్రణాళికలు అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో వీసీ పాల్గొని మాట్లాడారు. మహనీయుల ఆలోచనలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని సూచించారు. సదస్సులో 200 మంది విద్యార్థులు పాల్గొనగా 15 మంది పరిశోధన పత్రాలను సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో వైశాఖీ ఉత్సవాలు



అమీర్‌పేట: అమీర్‌పేటలో వైశాఖీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా గురుద్వారాలో శనివారం అమృత్ సంచార్ (హోలీ బాప్టిజం) కార్యక్రమం జరిగింది. సిక్కు మత గురువులు (రాగి జత్థాస్) గుర్బానీ కీర్తనలను ఆలపిస్తూ, గురు గ్రంథాన్ని పఠిస్తూ అమృత్ పాన్ (పవిత్ర పానియం)ను తయారు చేసి సిక్కు మత సంప్రదాయాలను పాటిస్తూ, సిక్కు మతాన్ని అధికారికంగా అంగీకరించేందుకు ముందుకు వచ్చిన వారికి పానియం అందజేశారు. యువతీ, యువకులు హోలీ బాప్టిజాన్ని స్వీకరించారు. పవిత్ర పానియాన్ని తీసుకున్న వారు జీవితాంతం సిక్కు మత నిబంధనలైన కేశ్, కడా, కంగా, కృపాణ్, కచేరాగా పేర్కొనే అయిదు నిబంధనలు పాటించాల్సి ఉంటుందని మత గురువులు తెలిపారు. గురుకా లంగార్ (సహపంక్తి భోజనాలు) చేశారు. బాటసారులకు షర్బత్, తాగు నీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా సాహెబ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శన్‌సింగ్, సురేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు కుశ్వంత్‌సింగ్, లాహోర్‌సింగ్, అజిత్‌సింగ్, హర్దీప్ సింగ్ పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు భారతరత్న ఇవ్వాలి



హిమాయత్‌నగర్: పద్మశ్రీ వనజీవి రామయ్యకు భారతరత్న ఇవ్వాలని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ భద్ర డిమాండ్ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో వనజీవి రామయ్య సంతాప సభ ఎంఎంసీసీ టాలెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ తమ్మినేని సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగింది. సంస్థ కార్యవర్గ సభ్యులు బీఎస్పీ పార్టీ తెలంగాణ సెంట్రల్ కో–ఆర్డినేటర్ దయానంద రావుతో కలిసి సీహెచ్ భద్ర మాట్లాడుతూ తన జీవితం మొత్తం నిస్వార్థంగా ప్రకృతి పరిరక్షణ కోసం అంకితం చేసిన ధన్యజీవి రామయ్య అని కొనియాడారు. కోటి మొక్కలు నాటి వివిధ వృక్ష జాతులు, జంతు జాతులను సంరక్షించడం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అంతర్జాతీయ స్థాయి పర్యావరణవేత్త అన్నారు. భవిష్యత్ తరాలకు వారి పేరు మీద ఒక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రామయ్య జీవిత చరిత్రను పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు అన్ని భాషలలో బోధించాలన్నారు. వారి కాంస్య విగ్రహం ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్, కోశాధికారి రిజ్వాన్, సహాయ కార్యదర్శి రాజేష్, రామకృష్ణ, గణేష్, లక్ష్మణ్, లక్ష్మి, నజీమున్నీసా, మోహన్, నాజం, బాబురావు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



అమీర్‌పేట: అమీర్‌పేట గురుద్వారా వద్ద జరిగే వైశాఖీ ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్సీ కవితకు శనివారం గురుద్వారా ప్రబంధక్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆమెను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, బీఆర్ఎస్ నాయకులు హనుమంతరావు తదితరులు ఉన్నారు.

జీవో–21ను సవరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల అధ్యాపకుల నియామకాలకు విడుదల చేసిన జీవో నంబర్–21ను సవరించాలని రాష్ట్ర ఉన్నత విద్య తెలంగాణ డాక్టోరేట్స్ అసోసియేషన్ (టీడీఏ) నాయకులు డా.నరేందర్ రెడ్డి, డా.తిరుపతి శనివారం డిమాండ్ చేశారు. అధ్యాపక ఉద్యోగాల నియామకాలో తెలంగాణ నిరుద్యోగులకే ప్రాధాన్యం ఇవ్వాలని, యూజీసీ–2018 గైడ్‌లైన్స్‌ను పాటించాలని, పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలో 30 మార్కులు ఇచ్చి, ఇంటర్వ్యూకు 1:30 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించాలన్నారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

చిలకలగూడ: నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. పుష్పాలు, విద్యుత్‌దీపాలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణోత్సవం జరిపించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోరిక మేరకు ప్రతి నెల రెండో శనివారం స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్నామన్నారు.



జ్ఞాపికలను బహూకరిస్తున్న ప్రకాశరావు

‘కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలను సమానంగా చూస్తుంది’



క్యాండిల్స్ ప్రదర్శన చేస్తున్న అద్దంకి దయాకర్ తదితరులు

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలను సమానంగా చూస్తూ దేశంలో సెక్యులరిజాన్ని కాపాడుతుందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని అమ్‌శ్రీ సమీరా ప్లాజాలోని గ్లోబల్ పీస్ ప్రేయర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రైస్తవ ఐక్యత ప్రార్థనా సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రిష్టియన్, ముస్లిం, హిందువులను బైబిల్, ఖురాన్, భగవద్గీత ఎలాగే దేశానికి రాజ్యాంగం అలాంటిదని దాన్ని కాపాడుకోవడంతో పాటు ప్రతి ఒక్కరు దానికి కట్టుబడి ఉండాలన్నారు. కులం, మతం, ప్రాంతాల మధ్య వైషమ్యాలను సృష్టించి రెచ్చగొట్టే రాజకీయ నాయకులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ మత విశ్వాసాలను ఆచరిస్తూ ఇతర మతాలను గౌరవిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. క్రైస్తవుల్లో ఐక్యత సాధించేందుకు ఈ ప్రార్థనా సమావేశాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పాస్టర్ ప్రభుకిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, రెవరెండ్ ప్రవీణ్‌కుమార్, జీపీపీ విమెన్ అధ్యక్షురాలు సునిత, బిషప్ బక్క ఏలియా, కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్‌కుమార్, అడ్వకేట్ డాక్టర్ సాల్మన్‌రాజ్, రెరెండ్ జీవరత్నం, రెవరెండ్ జీవన్‌కుమార్, పవన్‌కుమార్, ద్వివాణి చౌదరి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న ప్రిన్సిపాల్

రాంగోపాల్‌పేట్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు సెయింట్ మేరీస్ డిగ్రీ కళాశాలలో శనివారం కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐసీఈ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ సాయికుమార్, గ్లోబల్ కెరీర్ కౌన్సిలర్ శశి కోటగిరి, కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ పాదర్ డాక్టర్ వినయ్ ఆంటోనీ విద్యార్థులకు ఇంటర్ తర్వాత చేయాల్సిన కోర్సుల గురించి వివరించారు. ఆధునిక ప్రపంచంలో పోటీ పడాలంటే నిరంతరం విద్యార్థులు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెయింట్ మేరీస్ కళాశాల సిల్వర్ జూబ్లీ సంవత్సరం సందర్భంగా నిర్వహించిన స్కాలర్‌షిప్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ కూపన్లు అందించారు.

అనుమతిలేని మద్యం బాటిల్స్ స్వాధీనం

వెంగళరావునగర్: అనుమతి లేకుండా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకుని బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఈక్రమంలో ఎస్ఐ సాయికుమార్ శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా రహమత్‌నగర్‌కు చెందిన జైరామ్ జీ శివాజీ అనే వ్యక్తి ప్లాస్టిక్స్ కవర్స్‌లో మద్యం బాటిల్స్ పెట్టి విక్రయిస్తూ కనిపించాడు. పోలీసులు అతడిని విచారించగా అనుమతి లేకుండా బాటిల్స్ విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దాంతో అతడిని అరెస్టు చేసి 41 మద్యం బాటిల్స్(గుడ్ డే విస్కీ 180 ఎంఎల్ బాటిల్స్ 7, డెక్కన్ బ్లూ విస్కీ 180 ఎంఎల్ బాటిల్స్ 3, ఓసీ 90 బాటిల్స్ 31) స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. రెండు రోజుల పాటు ద్వాదశ జ్యోతిర్లింగాల అభిషేకం, చండీహోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు విశేష సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.